# సంక్రాంతి

**–తాటికోల పద్మావతి**

**పో**స్ట్ అన్న కేకతో బయటికి వచ్చి చూసింది శిరీష. పోస్ట్‌మ్యాన్ ఒక కవరు చేతికిచ్చి వెళ్ళిపోయాడు. ఈ రోజుల్లో అంతా ఫోన్ల మీదనే క్షేమసమాచారాలు జరుగుతున్నాయి. ఇంటర్నెట్లు, చాటింగ్, ఉత్తరాలు వ్రాసేదెవరబ్బా అంటూ కవరు చించి చూసింది. అది తన ఫ్రెండు కమల నుంచి వచ్చింది. కమలను చూసి చాలా కాలమైంది. పెళ్ళికి ఒకసారి వాళ్ళ ఊరు వెళ్ళింది. అంటే అప్పటి ఆ వాతావరణం చూసి ఇంకెపుడూ ఆ పల్లెటూరు వెళ్ళకూడదని నిశ్చయించు కొంది. శిరీష భర్తకి కమల భర్తకి ఒకే ఊర్లో పరిచయం. ఇద్దరూ ఒకే ఊళ్ళోనే పుట్టి పెరిగారు. చదువుల రీత్యా దూరమయారు. ఇద్దరూ ఉద్యోగస్తు లయ్యాక అపుడపుడు కలుసుకోవడం, రాకపోకలు జరిగాయి. కమల ఇన్నాళ్ళకి ఉత్తరం వ్రాసిందంటే ఆశ్చర్యం అనుకొంటూ లోపలకెళ్ళి ఫ్యాను క్రింద కుర్చీ వేసుకొని కూర్చుని చదవడం ప్రారంభించింది.

ఏమిటీ ఉత్తరం వ్రాశానని ఆశపడుతున్నావా. ఫోన్లులో మాట్లాడుకొంటే ఆ మాటల్ని అపుడే మరచి పోతాం. ఉత్తరం అయితే పదిలంగా దాచుకోవచ్చు. కావాలంటే మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు. ఈసారి సంక్రాంతికి మీరంతా మా ఊరు రావాలి. మా ఇంట్లోనే ఉండాలి. ఎపుడూ పట్నంలో సంక్రాంతిని చూస్తున్నారు. ఈసారి పల్లె సంక్రాంతి చూడచ్చు. పండుగ రెండు రోజులు ముందుగానే రావాలి. పిల్లల్ని మాత్రం తప్పనిసరిగా తీసుకురండి. వాళ్ళుంటేనే పండుగ సరదా. తప్పకుండా వస్తారని ఆశగా ఎదురు చూస్తుంటాము.

ఉత్తరం చదవడం పూర్తయింది. శిరీష భర్త ఆనంద్ భోజనానికి వచ్చాడు. ఎక్కడినుంచోయి ఆ ఉత్తరం. అంత దీర్ఘంగా చదువుచున్నావు?

'మీ ఫ్రెండ్ రాజేష్ భార్య కమల వ్రాసింది. ఈసారి సంక్రాంతి పండక్కి వాళ్ళ ఊరు రావాలిట.'

'ఫోన్ చేయొచ్చుగదా! ఈమాత్రం దానికి ఉత్తరం వ్రాయటం దేనికిట. మీ అంత తెలివి కమలకి లేక పోలేదు. ఫోన్‌లో మాట్లాడేదానికన్నా ఉత్తరాలు వ్రాసుకుంటేనే బాగుంటుందిట. ఎవరి పిచ్చి వారికా నందం. ఇంతకీ మీరేమంటారు. ఆ పల్లెటూర్లో ఏం తోస్తుంది బాబు. నాకైతే వెళ్ళాలని లేదు. ఎంచక్కా నేను, పిల్లలు హైదరాబాద్ వెళ్తాం. అక్కడ సిటీలో అన్నీ చూడొచ్చు.'

'చూశావుగా! మొన్న హైదరాబాద్‌లో ఏం జరి గిందో! సరదాగా చూడాలని వెళ్ళినవాళ్ళు బాంబులకి బలైపోయారు. నిర్లక్ష్యంగా ఎంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారో. హైదరాబాద్ ఇదివరకు చూశారు గదా. ఈసారి మనం రాజేశ్ వాళ్ళ ఊరు వెళ్దాం.

## సృష్టి - ఇదే దృష్టి

**మ**స్తిష్కంలో సమ్మెట పోటులు
సలుపుతున్న గాయాలు
మట్టి వింత వింత రూపాల్లో
అగ్ని పుష్పంలా విరజిమ్ముతున్న
చైతన్య పరిమళ తరంగాలు
పసిపాప నవ్వు మమత నందించింది
పసిపాప చూపు ప్రశ్నించే తత్వం నేర్పింది
ఆ పాప నడక మునుముందుకు ఉరికించింది
ఆలోచన పొద్దుపొడుపై
అనల సరస్సై విస్తరించింది
ప్రకృతిని జయించాలని ఆరాటపడ్డాను
ఆకాశాన్ని తాకి నక్షత్రాలు కోయడం
వట్టిదని అనుభవం నేర్పింది
అప్పుడు సహనం దారిచూపింది
ప్రవహిస్తున్న ఏరును ఆదర్శంగా ఎంచుకొని
అందులో ప్రవహించే నా తత్వాన్ని చూశాను
ఆ ప్రవాహం నిరంతరం జాతి జీవనాడిని
పరిరక్షించుకుంటూ...
జాతిని పునర్నిర్మాణం చేయడానికి
సంద్రంలో మమేకమై...
మళ్ళీ మండే నిప్పులతో చేయి కలిపి
ఆవిరై మబ్బు పొరల్లోకి వెళ్ళుతుంది
చినుకై కురుస్తుంది...
తడిసిన మట్టి పురుడు పోసుకుంటుంది
ఇదే సృష్టి - ఇదే సమదృష్టి.

**–డా॥ పెద్ది వెంకటయ్య**

నువ్వు ఆ ఊరు వచ్చి చాలా కాలమైంది. ఇప్పుడు ఊరు బాగా మారిపోయింది. నువ్వే చూస్తావుగా' అన్నాడు.

శిరీషకు ఇష్టం లేకపోయినా భర్త బలవంతంతో బయలుదేరింది.. తెల్లవారితే భోగి. ఆ ముందురోజు సెలవు పెట్టి రాజేశ్ కూడా బయలుదేరాడు. ఉదయం ఆరు గంటలకే బస్ ఉందన్నారు. పిల్లలిద్దరూ కిటికీ పక్కనే చేరారు. వాళ్ళపక్కనే రాజేశ్ కూర్చున్నాడు. బస్ పోతూ ఉంటే ఉదయపు చల్లటి గాలి ముఖానికి తగిలి చలిగా ఉంది. అక్కడక్కడా మంచు తెల్లగా ఉంది. చెరువు గట్టుమీద ఉన్న చెట్టుమీద కొంగల గుంపులు గుంపులుగా ఉన్నాయి. 'డాడీ, డాడీ అటు చూడండి. కొంగలు ఎన్ని ఉన్నాయో! అవి అక్కడ ఎందు కున్నాయ'ంటూ ప్రశ్నలు వేస్తున్నాడు కొడుకు సుధీర్.

ఇది చలికాలం గదా. పక్షులన్నీ ఆహారం దొరికే చోటుకి వలస వస్తాయి. ఇక్కడికి ప్రతి సంవత్సరం కొంగలు గుంపులు గుంపులుగా వస్తాయి. వాటికి ఆహారం ఇక్కడ పుష్కలంగా దొరుకుతుంది. పిల్లలు వేసే ప్రశ్నలకు సుధాకర్ ఓపిగ్గా జవాబు చెప్తున్నాడు. బస్ పొలాలన్నీ దాటుకుంటూ పోతున్నది. వరికోతలు పూర్తవడం వల్ల చేలన్నీ ఖాళీగా ఉన్నాయి. కొన్నిచోట్ల పత్తి, మిరప వేశారు. మిరపకాయలన్నీ చెట్టునిండా గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి. అప్పుడే పంటకొస్తున్నాయి. అక్కడక్కడా బంతిచెట్ల నిండా ముద్దబంతులు విరబూసి ఉన్నాయి. ఆ పంట చేలను, పూలమొక్కల్ని చూస్తుంటే మధురానుభూతి కలగక మానదు.

బస్ దిగి ఇల్లు దగ్గరే కావడంతో నడుచుకుంటూ వెళ్ళారు. ప్రతి ఇంటి ముందూ పెద్ద పెద్ద ముగ్గులు స్వాగతం పలుకుతున్నాయి. కమల ఇంటి ముందు పెద్ద ముగ్గు. అందులో గొబ్బిళ్ళు. వాటి మధ్యలో గుమ్మడిపూలు.

'డాడీ ఏమిటవి?' అడిగింది కూతురు స్వర్ణ.

'ఇవి ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు. ఈ పండుగ నెల రోజులు ప్రతిరోజూ ఉదయమే చీకటితో లేచి కళ్ళాపి చల్లి పెద్ద పెద్ద ముగ్గులు వేయడం సంక్రాంతి పండుగ స్పెషల్' అంటూ చెప్పాడు.

గేటులోకి అడుగు పెట్టగానే రంగు రంగుల ముద్దబంతి పూలు స్వాగతం పలుకుతున్నాయి.

'రండి రండి! మీరు ఎప్పుడు వస్తారో తెలీదు. లేకపోతే బస్టాండుకి వచ్చేవాళ్ళం' అన్నాడు రాజేశ్.

బస్టాండు నుంచి ఇల్లు దగ్గరేగా. సరదాగా అన్నీ చూస్తూ నడుచుకుంటూ వచ్చాం.

'రండి రండి కాళ్ళు కడుక్కోండి. కమలా వీళ్ళకి రూం చూపించు. స్నానాలు అవీ చేస్తారేమో కనుక్కో! కాఫీలు, టిఫిన్ల ఏర్పాటు చేశావా?'

'రాజేశ్! ఏమిటా హడావుడి. కమలకి అన్నీ తెలుసు, నువ్వేం చెప్పక్కరలేదు' అన్నాడు ఆనంద్.

'అవునులే. మీ చెల్లెల్ని వెనకేసుకు రావడం నీకు అలవాటేగా!'

'శిరీషా.. ఇదిగో ఇది మీ రూం మీ బ్యాగ్‌లు ఇందులో పెట్టుకోండి. ముందు కాఫీ తెస్తా'నంటూ వంట గదిలోకి వెళ్ళి ఐదు నిమిషాల్లో తిరిగొచ్చింది. చిక్కటి గేదెపాలతో చేసిన కాఫీ. 'అమృతం లాగా ఉన్నాయి' అన్నారు. పిల్లలిద్దరికీ పాలు తెచ్చి ఇచ్చింది.

టిఫిన్, వంట పనుల్లో శిరీష కూడా సాయం చేసింది.

ఆ కబుర్లు, ఈ కబుర్లు చెప్పుకుంటూ మధ్యాహ్నం భోజనాలు అయ్యాక గదిలో విశ్రాంతి తీసుకున్నారు శిరీష, ఆనంద్‌లు.

రాజేశ్ పిల్లలిద్దరూ వాళ్ళతో కలిసిపోయారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పెరట్లో జామకాయలు కోసి తిన్నారు.

మర్నాడు భోగి. ఇళ్ళు కడిగి ముగ్గులు పెట్టించి, సాయంత్రం ఆవుపేడ తెమ్మని ఆదెమ్మతో చెప్పింది.

సాయంత్రం కాగానే రాజేశ్- ఆనంద్‌ని తీసుకుని అలా చెరువు గట్టుదాకా వెళ్ళాడు. దారిలో నడుచు

## శ్రీరామరక్ష

చదువలేక చస్తున్నాం / ఈ ఘాతుకాలు
సమూలంగా మార్చండి / చట్టాల సమీకరణాలు!
'దండం దశగుణం భవేత్'
నయాన, భయాన కాదు
'భయాన్నే' భరతం పట్టాలి
ఈ ప్రేమోన్మాద ప్రబుద్ధులని!
'అనంత'లో ఘాతుకం / అంతులేని వ్యథాభరితం
అంతమొందించాలి ఆ
పైశాచిక ప్రేమ ప్రకోపాల్ని
ఆనాడే అబలలకు / మాన, ప్రాణ రక్షణ
మనుగడకూ శ్రీరామరక్ష!

-శ్రీమాన్ శ్రీకాశ్యప

కుంటూ ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకున్నారు. 'అప్పటికీ ఇప్పటికీ ఊరు చాలా మారిందిరా' అన్నాడు ఆనంద్.

'పిల్లలు చదువు కోవడానికి ఇంగ్లీషు కాన్వెంట్లు వెలిశాయి. ఆస్పత్రి కట్టించారు. ఒక్క సినిమా హాలు మాత్రం లేదు. పక్కనున్న సిటీకి వెళ్ళి చూడాలి. ఈ రోజుల్లో టీవీ లేని ఇల్లు లేదు. బయటకు వెళ్ళి సినిమాలు చూడటం తగ్గించేశారు.'

సాయంత్రం టిఫిన్ కింద అరిసెలు, చక్రాలు పెట్టింది కమల.

## కాయిన్ ఆఫ్ యూత్

ఆ చేతన ప్రజాస్వామ్య వ్యవస్థలోంచి
మేం బానిసత్వం నుండి
విముక్తి కావాలనుకుంటున్నాం!
ఈ దేశాన్ని మాకు
లౌకిక రాజ్యంగా వదిలివేయండి
పవిత్ర రాజకీయం కోసం ప్రార్థిస్తే
వృద్ధాప్యం ముంచుకొస్తుందని తెలుసు
మేం నిశ్శబ్ద విస్ఫోటనాన్ని కోరుకుంటున్నాం
దానిలో శాంతి కపోతాలు చూడాలనుకుంటున్నాం
జాతీయ గీతమెందుకు ఆలపించాలో
వందేమాతరం ఎందుకు జపించాలో
మూడు రంగుల పతాకంలో
అశోక చక్రం విలువేమిటో
మా భావితరానికి చెప్పదలుచుకున్నాం
మూడు సింహాలు
ఎందుకు జాతికి ప్రతీకలో తెలియని
రాజకీయ వ్యవస్థలో
మేం బ్రతుకుతున్నందుకు సిగ్గుగా వుంది
మేం ఈ దేశాన్ని
కొత్తగా స్వప్నీకరించుకోవాలనుకుంటున్నాం
మా కలల్ని వెలుగులుగా
పంచుకోవాలనుకుంటున్నాం
మువ్వన్నెల పతాకానికి
హుందాగా ఎగిరే సాంప్రదాయాన్ని
తిరిగి తేవాలనుకుంటున్నాం
మీ అనైతిక దృక్పథాన్ని
ఓటమిగా ఒప్పుకోమంటున్నాం

-మండాది గోపీనాథ్

'నీ ఓపికకు మెచ్చుకోవాలి. బియ్యం నానబోసి పిండికొట్టి అరిసెలు చేశావంటే ఎంత కష్టమో! నావల్ల కాదమ్మా. నేనైతే బజారు నుంచి తెప్పిస్తాను. ఇంత చాకిరీ ఎవరు చేస్తార'ంది శిరీష.

'ఇక్కడ మనం కష్టపడక్కరలేదు. చుట్టుపక్కల వారందరం ఒకరికొకరం సాయపడతాం. ఏ అవసరం వచ్చినా పిలవకుండానే చేసిపెడతారు.'

'మాకు పిలిచినా పలికే దిక్కుండరు. ఎవరి పనులు వాళ్ళకి సరిపోతాయి' అంది శిరీష.

ఆదెమ్మ పెద్ద సంచి నిండా బంతిపూలు తెచ్చింది. కమల వాటిని సూది, దారంతో గుచ్చి గుమ్మాలకి అందంగా అలంకరించింది.

భోగిరోజు తెల్లవారు ఝామునే అంతా లేచారు. కమల వాకిలి ముందు పెద్ద ముగ్గు వేసి రంగులు చల్లింది. పదేళ్ళ కూతురు వనజ ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ముగ్గు మధ్యలో పెట్టి పసుపు కుంకాలు చల్లుతుంటే శిరీష కూతురు వింతగా చూస్తూ నిలబడింది.

రోడ్డుమీద పెద్ద పెద్ద మొద్దులు వేసి భోగిమంటలు వేస్తున్నారు. ఇంట్లో పనికిరాని పాత కలప తెచ్చి ఆ మంటల్లో వేస్తున్నారు. వాటి చుట్టూ కూర్చుని చలిమంట కాచుకుంటున్నారు.

'రండి చూద్దాం' అంటూ రాజేశ్ పిల్లల్ని వెంటబెట్టుకుని ఆ భోగి మంట దగ్గరికి తీసుకెళ్ళాడు. కొంతమంది ఆ మంటల పక్కన పెద్ద కాగులతో నీళ్ళు కాచుకుంటున్నారు.

పెరట్లో కట్టెల పొయ్యి పెట్టి నీల్ళు కాచింది ఆదెమ్మ. అందరు తలంటు స్నానాలు చేశారు. కమల, శిరీష పిల్లల సాయంతో బీరువాలో, పెట్టెల్లో ఉన్న గాజు పింగాణి బొమ్మలన్నీ తీసి బల్లలు వేసి, వాటిమీద మంచి చీరలు పరచి అందంగా బొమ్మల కొలువును తీర్చిదిద్దారు. రకరకాల బొమ్మలు. సీతారాముడు దేవుడి బొమ్మల దగ్గర నుంచీ కొండపల్లి బొమ్మలు అన్నిరకాలు ఉన్నాయి.

మధ్యాహ్నం భోజనాలు కాగానే పేరంటం పిలవటానికి బయలుదేరారిద్దరూ. సాయంత్రం ముత్తయిదువులంతా వచ్చారు. ఆడ పిల్లలిద్దరూ సరదాపడి, బొట్టు గంధం రాశారు. బొమ్మలకి భోగిపళ్ళు పోసి అలాగే నలుగురు పిల్లల్ని కుర్చీలో కూర్చోపెట్టి వాళ్ళకి కూడా భోగిపళ్ళు పోశారు. శనగలు, రేగుపళ్ళు, బంతిపూలు, చిల్లర డబ్బులు అన్నీ కలిపి తలచుట్టూ

మూడుసార్లు తిప్పి తలమీద పోస్తారు. అలా పోయించు కోవడం శిరీష పిల్లలకి చాలా హ్యాపీగా ఉంది. రాజేశ్ ఫొటోలు తీశాడు. వచ్చిన ముత్తయిదువలందరికీ శనగలు, పండు, తాంబూలం ఇచ్చి పంపారు.

సంక్రాంతి రోజు అందరికీ కొత్త బట్టలు తెచ్చాడు రాజేశ్. బొట్టుపెట్టి శిరీషకు చీరె, పిల్లలకు కూడా బట్టలు ఇచ్చారు. వద్దంటున్నా కట్టుకునేంత వరకు ఊరుకోలేదు. సాయంత్రం ఇద్దరూ పేరంటానికి వెళ్ళి వచ్చారు.

'మమ్మీ! మమ్మీ! ఇక్కడ సంక్రాంతి పండుగ చాలా బాగా చేస్తారు. మనం ప్రతిసారీ ఇక్కడికే వద్దాం' అంది కూతురు శిరీష.

కనుము రోజు పశువుల్ని అలంకరించి పూజలు చేస్తున్నారు. కోడిపందాలు వేశారు. గాలిపటాలు ఎగురవేస్తున్నారు. సాయంత్రం సందె గొబ్బెమ్మను పెట్టి కన్నెపిల్లలంతా మంచి భర్త రావాలని కోరుకుంటూ గొబ్బి చుట్టూ పాటలు పాడారు. మూడు రోజుల సంక్రాంతి పండుగ ముచ్చటగా జరిగింది. శిరీష, ఆనంద్‌లు ఎంతో పొంగిపోయారు. పల్లెటూళ్ళల్లో సంప్రదాయ ప్రకారం జరుపుకుంటున్న సంక్రాంతి పండుగ మరచిపోలేని మధుర జ్ఞాపకంగా మిగిలి పోయింది.

రైతుల ఇళ్ళల్లో గాదెలు ధాన్యంతో నిండి ఉన్నాయి. ఏ ఇంట్లో చూసినా పండుగ సందడే. ఆ మూడు రోజులు క్షణంలో గడిచిపోయాయి. 'ఇంక సెలవు లేదంటూ వెళ్ళాల'ని బయలుదేరారు శిరీష దంపతులు. పిల్లలకి మాత్రం ఇంకా నాలుగు రోజులు సెలవులుంటే బాగుండుననిపించింది.

వాళ్ళు బయలుదేరుతుంటే అరిసెలు ప్యాక్‌చేసి ఇచ్చింది కమల.

'మీరు చూపించిన అభిమానానికి చాలా థ్యాంక్స్. బంధువుల కన్నా ఎంతో ఆప్యాయంగా చూశారని' ఎంతో పొంగిపోయారు.

ఒకొళ్ళకొకళ్ళు టాటా చెప్పుకుని బయలుదేరారు. రాజేశ్ బస్ ఎక్కేదాకా వచ్చాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక ఇల్లంతా బోసిపోయినట్టుగా ఉంది కమలకి. నాలుగు రోజులైనా ఫోన్ చేయలేదని ఎదురు చూశారు.

ఆ రోజే పోస్ట్ వచ్చింది శిరీష దగ్గర నుంచి.

'నేను కూడా ఉత్తరం వ్రాసినందుకు ఆశ్చర్యంగా ఉందా! నువ్విచ్చిన సలహానే ఇది. ఉత్తరం అయితే పది కాలాలపాటు దాచుకుని మళ్ళీ మళ్ళీ చదువుకో వచ్చు. ఈసారి సంక్రాంతి మీ ఊళ్ళో గడపడం మాకం దరికీ చాలా సంతోషంగా ఉంది. ఆ పల్లెటూరు ఎందుకులే హైదరాబాద్ వెళ్ళాలనుకున్నాను. ఈ మధ్య జరిగిన పేలుళ్లకు భయపడి మానేశాం. నిజంగా చెప్పాలంటే– ప్రశాంతమైన వాతావరణం ఆ పల్లె టూరిలోనే లభిస్తుందనిపించింది. దారిలో వచ్చే టప్పుడు ఆ చేలు, కాలువలన్నీ చూస్తుంటే బాల్యం తిరిగి వస్తే వాటివెంట తిరిగిరావాలని ఉంది. మొదటి నుంచీ నాకు పల్లెటూరంటే చిరాకు. ఇప్పుడు ఒక ప్రశాంత నిలయంలాగా కనిపిస్తున్నది. అక్కడ జరిపిన సంక్రాంతి సంబరాలు ఎన్నటికీ మరచిపోలేనివి. పౌష్యలక్ష్మికి ప్రతి ఇల్లు ముగ్గులతో స్వాగతం పలుకు తున్నట్లుగా ఉంది. గంగిరెద్దుల సన్నాయి మేళాలు, హరిదాసు భజన కీర్తనలు, సందె గొబ్బిళ్ళు, బొమ్మల కొలువు, పేరంటాళ్ళు చూసి మీ అన్నయ్యగారితో పాటు పిల్లలు కూడా చాలా మెచ్చుకున్నారు. ప్రతి సంక్రాంతికి అక్కడికే వెళ్దామని పిల్లలు ఒకటే గొడవ. సిటీలో కన్నా పల్లెల్లో జరుపుకునే సంక్రాంతి నిజమైన సంక్రాంతిలా ఉంది. నేను గొప్ప కోసం వ్రాయడంలేదు ఇదంతా. బంధువుల ఇంటికి వెళితే ఎందుకు వచ్చారా అని ముఖాలు చూసుకుంటారు. అయినవాళ్ళ కన్నా ఎక్కు వగా ఎంతో అభిమానించి ఆదరించారు. అరిసెలు పిల్లలకి బాగా నచ్చాయి. రాజేశ్‌ని, పిల్లల్ని అడిగినట్లు చెప్పు. మీరు కూడా వీలు చూసుకుని మా ఊరు రండి. చూడాలనుకుంటే పార్కులు, సినిమాహాళ్ళు, రెస్టారెంట్లు తప్ప ఇక్కడేం ఉండవు. ఒకసారి చూసినట్లు ఉంటుంది. ఇప్పటికే ఎక్కువగా వ్రాసి బోర్‌కొట్టిస్తే సారీ. ఇంతటితో ముగిస్తున్నాను. –శిరీష.

ఆ ఉత్తరం చదువుకుని రాజేశ్ వచ్చాక చెప్పింది.

'అందుకే అంటారు పల్లెటూర్లు పట్టణాలకు పట్టుకొమ్మల వంటివని. కవులు వర్ణించడానికి, అందాలను తిలకించడానికి, ప్రశాంత వాతావరణంలో గడపడానికి ఇక్కడున్న స్వేచ్ఛ, స్వచ్ఛమైన గాలి ఎక్కడ దొరుకుతాయి. పల్లెలు అంతరించిపోకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పల్లెల్ని అభిమానించాలి. వాటిని కాపాడుకోవాలి. మనం కూడా ఈ సంక్రాంతిని మరపురాని అనుభూతిగా మిగుల్చుకుందాం. మన మిత్రులతో కలిసి పండుగ చేసుకొన్నందుకు' అన్నాడు రాజేశ్.

భర్తవైపు తృప్తిగా చూసింది కమల. ■